# 'రేవతి నుంచి'....

పోరగా పోరగా చివరకు ఆసారి చూపించింది సీత. సీతకు ప్రతి లక్ష్మీవారం శ్రీకాకుళం నుంచి వొక ఉత్తరం వస్తుంటుంది. "ఎవరి దగ్గర నుంచి" అని ప్రశ్నిస్తే, "మా రేవతి రాసింది" అంటుంది. "చూడవచ్చా" అంటే పెదవులు కదపకుండానే చిరునవ్వు నవ్వుతూ "వల్లకాదు - యేమీ అనుకోకండి" అని నన్ను గాయపరచి, బుజ్జగించే చూపులు పెద్ద నల్లని కళ్ళల్లో మెరిపించి వూరుకుంటుంది. మోటుతనం చేతకాక 'అదేమిటో చూడాలి అనే కోరికను'అణుచుకుంటుండే వాణ్ణి. కాని ఆఖరికి వేదన హెచ్చవుతూ వచ్చింది. ఇక వుండబట్టలేక బాధపడి, బాధపడి చివరికి ఒకనాడు మృదువుగానే మోటుతనంచేసి ఆ వుత్తరం పుచ్చుకున్నాను.

అందులో - ఆమె అంత రహస్యంగా దాచవలసిన విషయాలే యేమీ లేవు. అదే అన్నాను సీతతో. కాని వప్పుకోదు సీత. "మా ఆడవాళ్ళ వుత్తరాలు మీకెందుకూ" అంటుంది. "నాకు వచ్చే వుత్తరాలన్నీ నువ్వు కూడా చదువుతున్నావుగా? నేనెప్పుడైనా అభ్యంతర పెట్టానా?" అన్నాను. సీత మాటాడలేక పోయింది.

ఆ తర్వాత వారం వచ్చిన వుత్తరం నన్ను పొగడ్తకు ప్రేరేపించింది అన్నాను.

"నాకు చాలామంది స్నేహితులూ యింకా మన వాళ్ళూ వుత్తరాలు వ్రాస్తుంటారు. కాని వుత్తరం చదువుతుంటేనే విసువు వస్తుంది. వాళ్ళ యిబ్బందులు, కష్టాలూతో నిండి వుంటాయి. ప్రతి సంసారంలోనూ వుంటాయి. ఐనా అక్కడకు తామే మహాకష్టాలలోపడి కొట్టుకపోతున్నట్టు వ్రాస్తారు. మనది కూడా సంసారమేననీ, మనం కూడా అటువంటి కష్టాలనూ, యిబ్బందులనూ యెదుర్కొంటుంటామని వాళ్ళకు తెలియదు కామోసు! ఈమె చూడు యెంత కమ్మగా వ్రాస్తుందో నాకాశ్చర్యం వేస్తుంది - యింత చక్కని ఫక్కీ, భాషా యెలా అలవడ్డాయా అని, ఏం చదువుకున్నదావిడ?"

"నేనూ, అదీ చిన్నప్పణ్ణుంచీ క్లాసుమేట్సుం. నాలానే థర్డ్‌ఫారం పాసయి మానేసింది. కాని చాలా పుస్తకాలు చదివింది".

"మరి మొద్దువి నువ్వు! తలక్రిందులు తపస్సు చేసినా యిలాటి వుత్తరం వ్రాయగలవా నువ్వు!"

"అది తపస్సుచేసినా నాలా పాడలేదు".

ఆసారికి ఆ విషయం యీ సంభాషణలోకి పరిణామం చెందింది.

తర్వాతసారి వుత్తరం నన్ను మరీ ఆకర్షించింది. ఇంత చక్కని భావాలు వెలుగులోకి రాకండా యెలా పుట్టాయో అలానే నశించి పోతున్నాయే - అన్న కించ బయలుదేరింది. వాటిని ప్రచురణకు పంపిస్తే బావుణ్ణనుకుని, సీతను అడిగాను. దాని పుట్టు యేదో మునిగిపోతున్నట్టు "అమ్మ బాబోయ్" అంది. కావలిస్తే పేర్లు మార్చేస్తాననీ, అదేం పరువు నష్టపు పని కాదనీ, యీ విషయం ఆమెకు తెలిసినా ఆమెకు కోపం రాదనీ, యింకా యింకా శతవిధాల బోధించి ఒప్పించి యీ వుత్తరం మీ సముఖానికి తీసుకవచ్చాను.

సీతా! నేను అనుకుంటున్నంత పనీ చేశావు. నేను నీ క్రిందటి వుత్తరానికి జవాబు యియ్యకపోయనంత మాత్రాన, మళ్ళా వుత్తరం వ్రాయడం మానేశావు! నీ యీ 'కాబూలివాలా స్వభావం'తో యెలా వేగుతున్నాడో యేమో ఆ మహాశయుడు!!

నీ సంగతి తెలిసి వుండి, క్రిందటి బుధవారం నుంచి ప్రయత్నిస్తూనే వున్నాను - జవాబు వ్రాయడానికి, కాని పడింది కాదు.

మొన్నటికి మొన్నా, నిన్నటికి నిన్నా, బాబు వచ్చి వ్రాయకుండా ఆపేశాడు. ఒంటి గంటకు తీరిక చేసుకొని కలం కాగితం తీసుకునేసరికి సన్నసన్నగా దోగాడుతూ వచ్చి ఆ కలం పూడలాక్కోవడానికి ప్రయత్నిస్తాడు. వాణ్ణి విదలించలేను. ఒకవేళ విదిలించినా - అర్థం చేసుకోలేక అమాయకంగా యేదో అరుస్తూ, సగం విప్పిన చేతులతో తియ్య తియ్యగా కొడతాడు. లేకపోతే ముంగురులు పట్టుకొని వ్రేలాడి పీకుతాడు ఏం చెయ్యడం - వాణ్ణి!?

కలం వొక మూలా, కాగితం వొక మూలా పారేసి యెత్తి గుండెలకు అదుముకొని నలిపేస్తాను. వూరికే నవ్వుతాడు!!

నిన్నవాణ్ణి అడిగాను - "యేంరా బాబూ! నువ్వు చూడబోతే రోజూ యిలా అల్లరిచేసి పిన్నికి వుత్తరం వ్రాయకండా చేస్తున్నావు - ఆ బుద్ధిలేని పిల్ల వుత్తరానికి అప్పు తీరిస్తేనేగాని మళ్ళా అప్పు పెట్టదు. యెలారా?"

వాడు నా గొంతు నుంచి వచ్చే ధ్వనిని వింటున్నట్టే అగపడి ఒక బోసినవ్వు జవాబా అని భ్రాంతి కలిగిస్తూ నవ్వాడు.

నేను మళ్ళా అడిగాను. – "నువ్వు యిలా అల్లరి చేస్తున్నావని – నీ పెంకెతనం గురించి పిన్నికి వ్రాయనా?" అన్నాను.

వాడేదో అరుస్తూ మళ్ళా నవ్వాడు.

నేను శాన్నాళ్ళయి ప్రయత్నిస్తున్నాను – వాడి భాష నేర్చుకోవటానికి. వాడు రెండు మూడు విధాల అరుపులూ, రెండు మూడు రకాల నవ్వులూ చాలా 'పోజు'ల్లో చూపులూ ద్వారా మాట్లాడుతుంటాడు. వాటిల్లో భేదాలు గుర్తించి అర్థాలు గ్రహించడానికి ప్రయత్నం చెయ్యాలని కొన్నాళ్ళయి అనుకుంటున్నాను. కాని మా 'సుకుమారపు – స్వాముల'వారి తోనూ, సంసారంతోనూ వేగేసరికే కాలం చాలకుండా వుంది. ఇక పరిశోధన లెప్పుడు?

చివర కివాళ వాణ్ణి నిద్రపుచ్చి దీనిని ఆరంభించాను.

వాణ్ణి జోకొడుతూ యీసారి యేమిటి వ్రాయడమా అని ఆలోచించాను. కాని నా ఆలోచనలు నిలిచి సాగాయి కావు. రోజూ వాణ్ణి జోకొట్టేటప్పుడు వింత వింత భావాలు వస్తుంటాయి.

ఆమధ్య ఒక పుస్తకం చదివాను. అందులో చెప్పారు. మనిషి స్వభావం గర్భంలో వుండేటప్పటి వాతావరణం నుంచీ తయారవుతూ వుంటుందట. హరి ద్వేషి పుత్రుడు హరి భక్తుడవడానికి కారణం గర్భస్థ ప్రహ్లాదుడు నారద మహర్షి ఆశ్రమంలో హరి చరితం వింటూ అభివృద్ధి నందటం వల్లనేనట. ఇలా యింకా చాలా చెబుతూ అంటాడు – 'మనిషి శిశువుగా వున్నప్పుడే భవిష్యత్తులో యెలా తయారవుతాడో గ్రహించవచ్చు'

ఆ పుస్తకం చదివిన దగ్గర నుంచీ నాకొక పిచ్చి పట్టుకుంది. బాబుగాడి ప్రతి చర్యకూ అర్థం తీసి వాడు భవిష్యత్తులో యేమవుతాడో గ్రహించడానికి ప్రయత్నిస్తాను.

వాడు కిటికీ ప్రక్కను మంచం మీద పడుకొని, గంటలకొద్దీ అలా బయట అగపడే ప్రకృతిలోకి దృష్టిని విడిచి, కాళ్ళూ చేతులూ అర్థయుక్త భ్రాంతిని కల్పించే విధంగా కదలిస్తూ, బోసినవ్వులతో కేరుతూ వుండే నాబాబు, – మళ్ళా తెలుగుల పాలిట రవీంద్రుడు ఔతాడనుకుంటాను. రవీంద్రుడు కూడా చిన్నప్పుడు యిలానే వుండి వుంటాడని భావించడానికి నాకు ఆధారాలు యేమిటో తెలియవు – కాని అలాగే అనుకుంటూ వుంటాను.

ఈనాడు ప్రపంచంలోని ప్రతీ చిన్న నేరానికీ తానే బాధ్యుడననుకుంటూ వొక్కో అప్పుడు శిక్షలు కూడా విధించుకునే మహాత్ముడు చిన్నప్పుడు యింట్లో యేదైనా దౌర్జన్యం జరిగి వుంటే యేం చేసి వుంటాడో? బహుశః పాలు త్రాగడం మానేసి వుంటాడేమో?

ఈనాడు యావద్భారత సంఘం నాయకత్వాన్ని వహించగలిగే ధీవరుడు, సత్య పరిశోధక మహర్షి, అహింసాయుత అసాధ్యశూరుడు, గాంధీ మహాత్ముడిలో 'అబద్ధం ఆడకూడదు తెల్సా?, తప్పమ్మా చీమను కొట్టవచ్చా?' అంటూ ప్రాథమిక బీజాలను నాటునది వారి తల్లి – ఒక సాధారణ స్త్రీ – అని జ్ఞాపకం వస్తే యేదో నమ్మరాని విషయం కళ్ళను చూస్తున్నట్లుంటుంది.

ఇంకా–

హిట్లర్: – యావత్తు మానవ సంఘాన్నీ, హృదయాలను అరచేత పట్టించిన హిట్లర్ – చిన్నప్పుడు తల్లి – ఒక సాధారణ స్త్రీ – కన్నెర్రకు, ప్రపంచపు విలువల్లో గడ్డిపూచ విలువైనా యివ్వబడని ప్రాథమిక బడిపంతులు ప్రేమ బెత్తానికి లోబడేవాడా!

నేను అనుకుంటాను – ఆనాడు యెవరైనా గ్రహించగలిగి వుంటారా – మారుమూలలో వున్న ఆ బాలకులు ప్రతి మానవుని కనుపాపలోనూ సుస్థిర నివాసం యేర్పరచుకొనగల ధీవరులమని!

ఇప్పుడు యీ మన చుట్టూ వున్న పిల్లలు – చిల్లిగవ్వ చెయ్యని మన బోధలనూ, కోపాలనూ శిరసావహించే పిల్లలలో, అవతార పురుషులు గానూ, రూపొందిన మృత్యువులుగానూ ఋజువు చేసుకొనే అపురూపులు వుండి వుండవచ్చు అన్న భావం యెంత విలువ అయినది!

యింకా–

అమ్మా! బాబు లేచాడే. ఆయన కూడా వచ్చే వేళయింది. ఈసారికి చాలిస్తాను. మళ్ళా త్వరలోనే వ్రాస్తాను.

– నీ రేవతి

★

*(చిత్రాంగి: మార్చి, 1946)*